

పంచాయతీ బకాయిలపై

ఇంటలిజెన్స్ ఆరా!

- గ్రామాల్లో 22 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన 6
- బకాయిల సమాచారం ఇచ్చాం : డీపీవో విభాగం నిఖిలశ్రీ

నారాయణపేటలో

ఆపరేషన్ చబుత్ర

- 56 మంది యువకులకు కౌన్సెలింగ్ 7
- 'పేట' ఎస్పీ వినీత్



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లోని తెగిన రేకులకుంట చెరువు కట్ట

ఆదిలోనే.. అవాంతరాలు..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభించక ముందే బయటపడుతున్న నాణ్యతా లోపాలు

- పునరుద్ధరణ చేస్తున్నప్పటికీ తెగుతున్న ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట
- గతేడాది ఆడిట్ కెనాల్ షట్టర్లు లేక మునిగిన వట్టెం మోటార్లు
- 2020లో కరివెన రిజర్వాయర్ వద్ద కుంగిన కట్టకు మరమ్మతులు
- నీళ్లు నింపితే మరెన్ని లోపాలు బయటపడతాయోననే ఆందోళన

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని చేపట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ) నిర్మాణం కొనసాగుతుండగానే అనేక లోపాలు బయటపడుతున్నాయి. 2023లో నార్లాపూర్ వద్ద ఒక మోటార్‌ను ఆన్ చేసి ప్రాజెక్టును ప్రారంభించామని చెప్పినప్పటికీ ఇంకా ప్రధాన కాలువల పనులు పూర్తి కాలేదు. తరచూ బయటపడుతున్న నాణ్యతా లోపాల కారణంగా ప్రాజెక్టు భద్రతపై ఆందోళన కలుగుతోంది. దీనికంటే ముందు రాష్ట్రంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, సుందిళ్ల, అన్నారంలో బుంగలు పడటంతో దాని భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకోగా, పునరుద్ధరించేందుకు ప్రభుత్వం డిజైన్లను ఆహ్వానించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. ఇదే విషయంపై పాలమూరు- రంగారెడ్డి పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోక ముందే లోపాలు వెలుగు చూస్తున్నాయి. 2020 నుంచి ఎక్కడో ఒకచోట నాణ్యతాలోపం బయటపడుతూనే ఉన్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు అంత వేగంగా నడవడం లేదు. కానీ, లోపాలపై దృష్టిపెట్టి పకడ్బందీగా నిర్మాణ పనులు చేపట్టకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి మాత్రం కచ్చితంగా ఉన్నదని చెప్పవచ్చు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కరివెన వద్ద కురుమూర్తిరాయ రిజర్వాయర్‌ను 19 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టారు. దీని ద్వారా 1.51 లక్షల ఎకరాలకు నీరిందించాలనేది లక్ష్యం. మొత్తం మూడు ప్యాకేజీలుగా విభజించి నిర్మాణం చేపట్టగా 13వ ప్యాకేజీ వద్ద 2020 ఆగస్టు 19వ తేదీన కురిసిన వర్షానికి కట్ట కుంగిపోయింది. అప్పట్లో ప్రస్తుత దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ కాంగ్రెస్ నాయకులతో ధర్నా నిర్వహించి రాష్ట్రస్థాయి సమస్యగా లేవనెత్తారు. తర్వాత కట్టకు మరమ్మతు చేశారు. ప్రస్తుతం ఈ కట్ట వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ 19 టీఎంసీలు పూర్తిస్థాయిలో నింపేనాటికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం దాదాపు పూర్తయ్యింది.

వరదలో మునిగిన వట్టెం మోటార్లు

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల్లో మూడో రిజర్వాయర్ అయిన వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్‌ను 16.74 టీఎంసీల సామర్థ్యంతో 1.33 లక్షల

(మిగతా 6లో..)



వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ పంప్‌హౌస్

కొల్లాపూర్‌కు.. చేపల ఉత్పత్తి కేంద్రం



కొల్లాపూర్‌లో జరిగిన మత్స్య దినోత్సవంలో పాల్గొన్న మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు ఈటల రాజేందర్, మల్లు రవి, చిత్రంలో నీలం మధు, ఎల్లేని సుధాకర్‌రావు, పగిడాల శ్రీనివాస్‌రెడ్డి

- పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- రూ.5 కోట్లతో హైదరాబాద్‌లో ముదిరాజ్ భవనం
- పోరాడి హక్కులు సాధించుకోవాలి
- ప్రభుత్వం మత్స్యకారులకు సహకారం అందిస్తోంది
- ప్రపంచ మత్స్య దినోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీలు మల్లు రవి, ఈటల

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇక్కడి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా స్థానికంగా చేపల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేస్తానని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో ముదిరాజ్ సంఘం

(మిగతా 6లో..)



మాట్లాడుతున్న నీలం మధు

త్వరలో మత్స్యకారుల దీర్ఘకాల సమస్యల పరిష్కారం

- కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలం మధు

వార్త 6లో..

నాణ్యమైన ధాన్యాన్ని.. కొనుగోలు చేయాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
- హన్వాడ కొనుగోలు కేంద్రం పరిశీలన
- రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా



హన్వాడలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

హన్వాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ధాన్యం శాతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

సాలార్‌నగర్‌లో కలెక్టర్ పర్యటన

గండీడ్: భూభారతి పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన మండలంలోని సాలార్‌నగర్ గ్రామంలో కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. సర్వే, భూపత్రాల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వే వివరాలను, రికార్డులను, మ్యాప్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధసూదన్‌నాయక్, ఆర్డీవో నవీణ్‌కుమార్, ఏడీ కిషన్‌రావు, నాయకులు జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

- 416 గ్రాములు స్వాధీనం

మహబూబ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ - భూత్పూర్ బైపాస్ రహదారిలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ అనే వ్యక్తి వద్ద 4 ప్యాకెట్ల (20 గ్రాములు) గంజాయి లభించింది. అతడిని విచారించగా, భూత్పూర్‌లోని ఒక వెంచర్ మ్యాన్‌హోల్‌లో గంజాయి దాచినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే భూత్పూర్‌కు చెందిన సయ్యద్ రియాజ్‌కు విక్రయించినట్లు తెలపడంతో, అతడి వద్ద 196 గ్రాముల గంజాయి లభించింది. దీంతో ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐ రాజేందర్ పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులు



పోతన్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

విప్లవంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం దేశంలో విప్లవంగా మారనుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని కోటకదిర, పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పోతన్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిరుపేదలకు ఇందిరమ్మ రాజ్యంలో కూడు, గూడు, గుడ్డ అందించాలనేది ముఖ్యలక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరబోతోందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు రాఘవేంద్ర, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, రవీందర్, నాయకులు మాధవ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, ఖాజ, శేఖర్‌రెడ్డి, షైబు, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

చిత్తడి నేలల జాబితా సిద్ధం చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో చిత్తడి నేలల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో చిత్తడి నేలల సర్వే, సరిహద్దులు, నోటిఫికేషన్ కోసం జిల్లా తడి భూముల కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుంచి 3 నెలల్లోపు జిల్లాలోని అన్ని చిత్తడి నేలల జాబితాను సిద్ధం చేయాలన్నారు. కమిటీకి చైర్మన్ కలెక్టర్, కన్వీనర్ మెంబర్‌గా జిల్లా అటవీ శాఖ అధికారితో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో కూడిన 7 మంది సంబంధిత శాఖల అధికారుల బృందం ఉండనుంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్ – నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 213.00
స్కిన్ లెస్	: 243.00

విజ్ఞానం.. వినూత్నం!

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థుల ఆసక్తి 7

ప్రయాణికురాలిగా ఎస్పీ

- సివిల్ డ్రెస్‌లో బస్టాండ్‌కు..
- బాలికల భద్రత, ఆకతాయిల వేధింపులపై ఆరా తీసిన జానకి



ఓ విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్పీ

మహబూబ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ బాస్(ఎస్పీ) జానకి.. సాధారణ ప్రయాణికురాలిగా సివిల్ డ్రెస్‌లో శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ బస్టాండ్ అంతా కలియ తిరిగారు. కళాశాల వదిలిన సమయానికి అక్కడికి వెళ్ళిన ఆమె బాలికలు, మహిళలను ఎవరైనా ఆకతాయిలు వేదిస్తున్నారా? ఈవ్ టీజింగ్ చేస్తున్నారా? అని పరిశీలించారు. ఆ తరువాత వారి వద్దకెళ్లి మీకేమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా భద్రత-పోలీసు బాధ్యత కార్యక్రమంలో భాగంగా బస్టాండ్‌కు వచ్చారు. అనంతరం వారి వద్దకు వెళ్ళి తాను ఎస్పీనని పరిచయం చేసుకొని వారితో మాట్లాడారు. అభద్రతగా అనిపిస్తే 100, షీటీమ్ నెంబర్ 8712659365 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. బాలికలతో షీ టీమ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నివాసులు, సురక్ష కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు.. పోటెత్తిన ధాన్యం

- తేమ ఎక్కువగా ఉన్నా కొనుగోలు
- క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,781
- అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రూ.2,389 మాత్రమే



పేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన ధాన్యం

నారాయణపేట, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం పోటెత్తుతోంది. క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా ఇవ్వడం, కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు కఠినంగా ఉండటమే అందుకు కారణంగా చెప్పొచ్చు. ధర గరిష్ఠంగా రూ.2,781, కనిష్ఠంగా రూ.1,700 రమారమి రూ.2,389 పలుకుతోంది. తేమ అధికంగా ఉన్నా.. యార్డులో ట్రేడర్స్ కొనుగోలు చేస్తుండటంతో రైతులు కోసిన వెంటనే ట్రాక్టర్లలో యార్డుకు తరలిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు గన్నీ బ్యాగులు ఇవ్వలేదు. పైగా ధాన్యాన్ని కేంద్రాలకే తేవాలని చెబుతుండటంతో రవాణా, ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు రైతులు మార్కెట్ యార్డుకే ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. పేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ఈ సీజన్‌లో ఈ నెల 19వ తేదీ వరకు 32,369 క్వింటాళ్ల ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేశారు. 117 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, ఈనెల 20 వరకు 23,520.360 క్వింటాళ్ల ధాన్యాన్ని కొన్నారు. అందుకు సంబంధించి రూ.54.26 కోట్లకు గాను రూ.20.02 కోట్లు రైతుల ఖాతాల్లో సమ చేశారు.

రైతులకు ఇవ్వని గన్నీ బ్యాగులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వలేదు. తేమ 17 శాతం లోపు ఉండాలని చెబుతున్నారు. గతంలో ముందుగానే గన్నీ బ్యాగులు ఇవ్వడంతో పాటు వాహనాలు వెళ్లే అవకాశం ఉన్న చోటకు వెళ్లి ధాన్యం లోడ్ చేయించేవారు. దాంతో రైతులకు రవాణా ఖర్చులు మిగిలేవి. ఈ సారీ రైతులే కేంద్రాలకు ధాన్యం తేవాలని చెబుతున్నారు. క్వింటాలుకు మద్దతు ధర గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2,389 ఉండగా, సాధారణ రకానికి రూ.2,369 పలుకుతోంది. సన్నాలకు క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తామని చెబుతున్నా గత సీజన్ డబ్బులు ఇంకా పడలేదు. మార్కెట్ యార్డులో ధర ఎక్కువ రావడంతో నిబంధనలు ఉండకపోవడంతో అక్కడ విక్రయించేందుకే రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పంచాయతీ బకాయిలపై ఇంటలిజెన్స్ ఆరా!

- గ్రామాల్లో 22 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన
- పారిశుధ్య నిర్వహణకు కార్యదర్శుల అవస్థలు
- రూ. 3 నుంచి రూ. 5 లక్షల అప్పులు
- బకాయిల సమాచారం ఇచ్చాం : డీపీవో భాగం నిఖిలశ్రీ



శేర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల బకాయిలపై ఇంటలిజెన్స్ విభాగం ఆరా తీస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాని బిల్లుల వివరాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ, ఇతర పనుల కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రైవేటుగా తెచ్చిన అప్పుల వివరాలను సేకరిస్తోంది. పూర్తి వివరాలతో నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు గత మూడు రోజులుగా అన్ని మండల పరిషత్ కార్యాలయాలు, డీపీవో కార్యాలయంలో వివరాలను సేకరించారు. ఇంటలిజెన్స్ విభాగం పంపిన వివరాల ఆధారంగా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో నిధులు విడుదల చేసే అవకాశం ఉంది.

కేంద్రం నుంచి విడుదల కాని నిధులు

స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీ కాలం 2023 డిసెంబరులో పూర్తయింది. అప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పడింది. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దగా నిధులు సమకూర్చలేదు. దీంతో కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర పనులు చేపట్టాల్సి వచ్చింది. గ్రామ జనాభాను బట్టి ఒక్కో కార్యదర్శి రూ.3 నుంచి రూ. 5 లక్షల వరకు అప్పులు తెచ్చి ఖర్చు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతీ సంవత్సరం రూ. 48 కోట్లు రావాల్సి ఉంది. సగటున మనిషికి ప్రతీ నెల రూ. 806 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చిస్తాయి. ఈ లెక్కన 22 నెలలకు రూ. 95 కోట్ల మేర నిధులు రావాల్సి ఉంది.

సమాచారం అందించాం



జిల్లాలోని 16 మండలాల పరిధిలోని గ్రామాల్లో బకాయిల వివరాలను ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు అందించాం. గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులు వ్యక్తిగత రుణాలు తెచ్చి నిర్వహిస్తున్నారు. దీంతో వారు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

- భాగం నిఖిలశ్రీ, డీపీవో

వానలతో నల్లబారిన పత్తి

- మద్దతు ధర లభించదని ఆందోళన
- గుంటుకతో పంటను దున్నేసిన రైతు



పత్తి చేనును ట్రాక్టర్‌తో దున్నేసిన రైతు

అమ్రాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో పత్తి పంట నల్లబారిపోయింది. దీంతో మద్దతు ధర లభించదని రైతు ఆవేదనకు గురయ్యాడు. పత్తి తీయకుండానే పంటను గుంటుకతో దున్నేశాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని టీకే తిర్మలాపూర్‌లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన ఎలకచేను రాఘవులు నాలుగు ఎకరాల్లో ప త్తి పంట సాగు చేశాడు. అందు కోసం ఎకరానికి రూ. 60 వేల చొప్పున, 2.40 లక్షలు ఖర్చయ్యింది. సకాలంలో వర్షాలు కురవడంతో పంట ఏపుగా పెరిగింది. ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రాఘవులు ఆశించాడు. కానీ గత నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో పత్తి పంట దెబ్బతిన్నది. అంతోఇంతో మిగిలిన పత్తి కాయ కూడా నల్లగా మారిపోయింది. దీంతో మద్దతు ధర లభించదని ఆందోళన చెందాడు. నాలుగు ఎకరాల పత్తి పంటను శుక్రవారం గుంటుకతో దున్నేశాడు. పత్తి తీసినా, వచ్చే డబ్బు కూలీలకు కూడా సరిపోదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

పదర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని ఇప్పటిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునితాబాయికి విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉపాధ్యాయులు లేరని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బడికి తాళం వేసి ఆందోళన చేపట్టిన సంఘటన ఈనెల 19న పలు పత్రికల్లో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో డీఈవో ఆదేశానుసారం పదర ఎంఈవో బుచ్చిబాబు శుక్రవారం పాఠశాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు సునితాబాయి విధుల్లో ఉన్నా, విద్యార్థులకు బయటకు పంపించడం సరికాదని తెలిపారు. దీనిపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంఈవో వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం రామిరెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని మోట్లంపల్లికి గ్రామానికి చెందిన మారబండ రాఘవేంద్ర (34) మహేశ్వరి భార్యాభర్తలు. ఇటీవల వారి ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా ఇద్దరూ గొడవపడ్డారు. ఆ తర్వాత రాఘవేంద్ర ఇంటి నుంచి వెళ్లిపోయి పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయన్న తెలిపారు.

డిండి ఎత్తిపోతల ప్యాకేజీ - 6కు సీవోటీ ఆమోదం

- గణపసముద్రం, పెద్ద చెరువుల పునరుద్ధరణ

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిండి ఎత్తిపోతల పథకం, ప్యాకేజీ-6లో రూ.49 కోట్ల పనులకు కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) ఆమోదం తెలిపింది. నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ అధ్యక్షతన శనివారం సీవోటీ సమావేశం నిర్వహించారు. ప్యాకేజీ - 6లో రూ.49 కోట్ల పనులను ఇదివరకే టెండర్ దక్కించుకున్న సంస్థ, మరో సంస్థతో చేపట్టడానికి వీలుగా ప్రతిపాదనలు రాగా... సీవోటీ ఆమోదించింది. అలాగే వనపర్తి జిల్లాలో రూ.22 కోట్లతో గణపసముద్రం, పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు కూడా ఆమోదం తెలిపింది.

దిగుబడి రాక.. గిట్టుబాటు లేక..



మానవపాడు మండల కేంద్రంలో రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసిన పత్తిని రాయచూరుకు తరలించేందుకు ఎత్తుతున్న హమాలీలు

- నష్టపోతున్న పత్తి రైతులు
- 'కపాస్ కిసాన్'పై అవగాహన కరువు
- స్లాట్ బుక్ చేసుకోలేక ఇబ్బందులు
- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు తరలింపు

అలంపూరు చౌరస్తా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విత్తనాల కొనుగోలు నుంచి, దిగుబడి విక్రయం వరకు పత్తి రైతుకు కష్టాలు తప్పడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది దాదాపు 1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా, ఈ ఏడాది విస్తీర్ణం పెరిగి 1.50 లక్షల ఎకరాలకు చేరుకున్నది. గత ఏడాది పత్తి సాగు చేసిన రైతులు లబ్ధి పొందడంతో ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ ప్రారంభంలోనే అధిక వర్షాలు కురవడంతో పత్తి పంటలో ఎదుగుదల లోపించి, పూత, కాత రాలిపోయింది. అక్కడక్కడ కాసిన కాయలు కూడా మురిగిపోయాయి. దీనికి తోడు వివిధ తెగుళ్ల ఆశించడంతో, ఎర్రనల్లి దాడి చేసింది. దీంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. పైగా ప్రారంభంలో వ్యాపారులు క్వింటాలు పత్తికి రూ.2వేల మేర ధర తగ్గించి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను మునుపటి కంటే రూ.400లు పెంచి, రూ.8110గా నిర్ణయించింది. దీంతో అరకొర వచ్చిన దిగుబడులకైనా గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు సంతోషించారు.

అమ్ముకునేందుకు కష్టాలు

కానీ పత్తి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. కొనుగోళ్లలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేక రైతులు కష్టాలు పడుతున్నారు. దిగుబడి అయిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు ఈ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ముందు రోజు నిర్దేశిత సమయానికి స్లాట్ ఓపెన్ అవుతుంది. ఆ సమయంలోనే రైతులు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ రైతులందరూ ఒకే సారి స్లాట్ బుకింగ్‌కు యత్నించడంతో కొద్దిసేపటికే నాట్ అవేలబుల్ అని చూపిస్తోంది.

రైతులు ఈ కష్టాలు పడలేక పత్తి విక్రయానికి దళారులను ఆశ్రయించి మద్దతు ధర పొందలేకపోతున్నారు.

లబ్ధి పొందుతున్న వ్యాపారులు

కపాస్ కిసాన్ యాప్‌పై సరైన అవగాహన లేక రైతులు నష్టపోతుండగా, దళారులు, వ్యాపారులు లబ్ధి పొందుతున్నారు. మొబైల్ ఫోను లేని రైతులు, ఫోను ఉన్నా యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్న రైతులు పత్తిని దళారులకు విక్రయిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు నాణ్యమైన పత్తి క్వింటాలుకు రూ.8110 ధర లభిస్తుండగా, బహిరంగ మార్కెట్లో దళారులు మాత్రం క్వింటాలుకు రూ.45వేల నుంచి రూ. 6వేల మధ్య ధర చెల్లిస్తున్నారు. కూలీలకు చెల్లింపులు, ఫర్టిలైజర్ దుకాణాల్లో బాకీలు తీర్చడం ఆర్థిక అవసరాల నేపథ్యంలో రైతులు దళారులకు విక్రయించక తప్పడం లేదు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యాపారులు గ్రామాల్లో బ్రోకర్లను నియమించుకుని రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన పత్తిని అధిక ధరకు విక్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

ఆదిలోనే అవాంతరాలు

(5వ పేజీ తరువాయి)

ఎకరాల ఆయకట్టుకు నిరందించే ఉద్దేశంతో చేపట్టారు. దీనికి ముందు ఉన్న ఏదుల రిజర్వాయర్ నుంచి ఓపెన్ కెనాల్, టన్నెల్ ద్వారా 24.575 కిలోమీటర్లు ప్రయాణించి నీరు వట్టెం పంప్‌హౌజ్‌కు చేరుకుంటుంది. ఇక్కడి 121 మీటర్ల ఎత్తుకు నీటిని తీసుకెళ్లి వట్టెం రిజర్వాయర్‌లో వదలాలి. మొత్తం 10 మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అప్పటికే నాలుగు మోటార్లు సిద్ధం చేశారు.

గతేడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు నాగర్‌కర్నూలు జిల్లా శ్రీపురం వద్ద ఏర్పాటు చేసిన ఆడిట్ టన్నెల్‌లోకి పైన ఉన్న చెరువు కట్ట తెగిపోయి నీళ్లు చేరింది. అక్కడ నుంచి ప్రధాన మార్గం, సర్జ్‌పూల్, పంపుహౌజ్‌లలో వరద చేరి మోటార్లు నీటమునిగాయి. దీనికి కారణం ఆడిట్ టన్నెల్‌లోకి నీరు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం వరదను నిరోధించేలా షట్టర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయకపోవడమే కారణంగా చెప్పవచ్చు. ప్రమాదం జరిగిన తర్వాత రాళ్లు, మట్టితో ఆడిట్ టన్నెల్‌లోకి నీరు రాకుండా అడ్డుకట్ట వేశారు. బురద నీటిని ఎత్తిపోయించి ప్రస్తుతం నాలుగు మోటార్లను పునరుద్ధరించి డ్రైరన్ చేసినట్లు ఈఈ పార్థసారథి తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్పష్టమైంది.



గండిపడిన ఉదండాపూర్ రిజర్వాయర్‌లోని రేకులకుంట చెరువు కట్టకు పోసిన మట్టి

ఉదండాపూర్ కట్ట కోత...

ఉదండాపూర్ రిజర్వాయర్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి చాలా కీలకమైన రిజర్వాయర్. మొత్తం 16.03 టీఎంసీల సామర్థ్యంతో 5.02 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని చేపట్టారు. దీని తర్వాత డిజైన్ చేసిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ రద్దు కావడంతో దాని పరిధిలోని 4.13 లక్షల ఎకరాలకు కూడా ఉదండాపూర్ ద్వారా నీరు వెళ్లాల్సిందే. అయితే ఇంత కీలకమైన రిజర్వాయర్ కట్ట నిర్మాణంలో నాణ్యతాలోపాలు బయటపడుతున్నాయి. ఈ ఏడాది రెండుసార్లు కట్ట కోతకు గురైంది. సెప్టెంబరులో ఓసారి కోతకు గురైతే మరమ్మతులు చేయగా అక్టోబరులో మరోమారు కోతకు గురైంది. సుమారు 20 ఫీట్ల మేర గోతులు ఏర్పడ్డాయి. నాసిరకం మట్టిని వాడటం, అందులో ఉన్న రాళ్లను తీయకుండా రోలింగ్ చేయడంతో పాటు రివిట్‌మెంట్ సరిగా లేకపోవడంతో కట్ట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల పొలాల్లోకి మట్టి కొట్టుకువచ్చి మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కట్ట నుంచి నీరు లీకవుతుండటంతో వర్షాలతో నీరు పొలాల్లోకి చేరుతోంది. కాంట్రాక్టర్లు గతంలో లీకైన నీరు వ్యవసాయ భూముల్లోకి రాకుండా కట్ట కింది భాగంలో పొలాల వెంట జేసీబీలతో ఐదు ఫీట్ల వెడల్పుతో కందకాలు తవ్వించి నీటిని మళ్లించారు. ఈ క్రమంలో పొలాల్లోకి వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతుండగా కట్ట కోతకు గురికావడంతో ఆ కందకాలు కూడా నిండిపోయి వచ్చిన నీటితో పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం ఇలాంటి లోపాలపై ఇప్పుడే దృష్టి పెడితే ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యం దెబ్బతినదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో తీగల వంతెన పనులు

- ఎంపీ ఈటల రాజేందర్
- నిర్మాణ స్థలం పరిశీలన

కొల్లాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమశిల - సిద్దేశ్వరం కొండల నడుమ ఐకానిక్ తీగల వంతెన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు నేతృత్వంలో, నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల వద్ద కృష్ణానదిలో నాయకులతో కలిసి బోటింగ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన తీగల వంతెన నిర్మించనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ తర్వాత అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మొట్టమొదటిసారి వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో ఐకానిక్ తీగల వంతెనను మంజూరు చేసిందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమై, వేగవంతంగా పూర్తి అవుతాయని తెలిపారు. ఇప్పటికే 167కే జాతీయ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పట్టుబట్టి వీటిని సాధించిన ఘనత ఎల్లేని సుధాకర్‌రావుదేనని తెలిపారు.



సోమశిల వద్ద కృష్ణానదిలో తీగల వంతెన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్‌కు చేపల ఉత్పత్తి కేంద్రం

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మత్స్యకారులు కొల్లాపూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రులు, ఎంపీలు, నాయకులు మత్స్యకారులతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని సురభి రాజా బంగ్లా ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మత్స్యకారులను ఉద్దేశించి మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. మత్స్యకారులను బీసీ 'డీ' గ్రూపు నుంచి 'ఏ' గ్రూపులోకి మార్చేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో రూ.5 కోట్లతో ముదిరాజ్ భవనం నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలు ఏవైనా ముదిరాజులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో తెనుగోళ్లకు ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి దేశవ్యాప్తంగా చేపల ఎగుమతి జరిగేలా మత్స్యకారులకు తాను సహకారం అందిస్తానని తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ... మత్స్యకారులు అందరికీ పౌష్టికమైన ఆహారాన్ని అందిస్తారు.. కానీ వారు మాత్రం ఆకలితో అలమటిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను మత్స్యకారులకు అందేలా కృషి చేస్తానని వెల్లడిచారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. నీలం మధు ఎల్లేని సుధాకర్‌రావు, డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, బయ్య శ్రీనివాసులు మాట్లాడారు.

మత్స్యకారులు ఐక్యంగా ఉండి ఉద్యమిస్తే సాధించలేనిది ఏది లేదని అన్నారు. బహిరంగ సభకు మత్స్యకారుల సంఘం జిల్లా నాయకుడు పెబ్బేటి మల్లికార్జున్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పెబ్బేటి కృష్ణయ్య, వాకిటి ఆంజనేయులు, వివిధ గ్రామాల మత్స్యకారులు , నాయకులు పాల్గొన్నారు.

త్వరలో మత్స్యకారుల దీర్ఘకాల సమస్యల పరిష్కారం : నీలం మధు

మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని, త్వరలో మత్స్యకారుల దీర్ఘకాల సమస్యలు పరిష్కారం అవుతాయని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన మాట్లాడారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టం కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొందరు అడ్డంకులు సృష్టించి తాత్కాలికంగా అడ్డుకున్నారని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. త్వరలో అందరి పెద్దలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి మన డిమాండ్లను సాధించుకుందామన్నారు.

పడమటి అంజన్న హుండీ లెక్కింపు



పడమటి ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం

మక్తల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.2,72,764 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి కవిత తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త ప్రాణేషాచారి, సిబ్బంది శ్రీనివాసులు, సురేందర్ పాల్గొన్నారు.

మద్దిమడుగు ఆలయంలో..



మద్దిమడుగు ఆలయంలో నగదును లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

పదర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ. 26,18,711తో పాటు, మిశ్రమ వెండి 2.810 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ టీ.మదన్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ డి.రాములునాయక్, పాలక మండలి సభ్యులు బసిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీను, సుబ్బదాసు, టీజీవీబీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్దకల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు

మల్దకల్, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల హుండీని శుక్రవారం లెక్కించారు. రూ. 21,82,936 ఆదాయం లభించినట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాదికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. గత సంవత్సరం రూ. 18,41,990 సమకూరగా, ఈ సారి అదనంగా రూ. 3,46,946 లభించాయని చెప్పారు. చింతలాముని ఆలయ హుండీ ద్వారా రూ.34,630 సమకూరిందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, సిబ్బందితో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- బీఎస్పీ నాయకుల డిమాండ్



ఉప్పునుంతల తహసీల్దార్ సునితకు వినతిపత్రం అందిస్తున్న బీఎస్పీ నాయకులు

ఉప్పునుంతల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉత్పర కృపానందం మాట్లాడుతూ మండల పరిధిలోని దాసర్లపల్లి సమీపంలోని పట్టా భూమిలో ఇసుక తవ్వకాలు అనుమతి తీసుకొని, పక్కనే ఉన్న దుందుభీ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఆ ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, పృథ్వీరాజ్, రవి, నాగేశ్, హర్ష, శ్రీను, శేషు, సాయి, నాగరాజు, రామచంద్రర్, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మన్ననూరు విద్యార్థిని

మన్ననూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని పి. అక్షిత ఎంపికయ్యింది. ఆమెను ప్రిన్సిపాల్ రూపాదేవి, పీడీ అస్మద్ బేగం, పీఈటీ విజయరాణి శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాలమూరు విద్యార్థి



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీకి ఎంపికైన రోహిత్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : నల్గొండ జిల్లాలో శనివారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు పాలమూరు జిల్లా, చిన్నదర్‌పల్లి హైస్కూల్ విద్యార్థి రోహిత్ ఎంపికయ్యాడు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అతడిని ప్రధానోపాధ్యాయిని శైలజ, పీడీ వేణుగోపాల్ అభినందించారు.

ఖోఖో శిక్షణా శిబిరం ప్రారంభం



జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో ఖోఖో శిక్షణ క్యాంపును ప్రారంభిస్తున్న ఎస్ఐ గోవర్ధన్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జూనియర్స్ ఖోఖో ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్టు శిక్షణా శిబిరం శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. జడ్పీ మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్ఐ గోవర్ధన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వర్‌రావు, ఖోఖో సంఘం జిల్లా ఇన్‌చార్జి రంజన్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ నిజాముద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, సామా రమేశ్, మొగులాల్, రవికుమార్, లక్ష్మి, తులసి, రాఘవులుగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బొలెరో ఢీకొని మాజీ సర్పంచు దుర్మరణం

» గ్రామస్థులు, కుటుంబ సభ్యుల ఆందోళన

» సంఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్



చిన్న భీమరాయుడు (ఫైల్)

ధరూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలోని నందిన్నె మాజీ సర్పంచు చిన్నభీమరాయుడు (45) బొలెరో ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన ధరూరు మండలం జాంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్న భీమరాయుడు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గద్వాలకు వెళ్లి, సాయంత్రం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. జాంపల్లి స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సం ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి వచ్చారు. భీమరాయుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. నాలుగు గంటల పాటు ఆందోళన కొనసాగింది. వార్త తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, సీఐ టంగుటూరి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో గ్రామస్థులు కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐ వారికి నచ్చచెప్పి మృతదే హాన్ని ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.

కల్వర్టుపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

చారకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వర్టుపై కూర్చున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ పి.వీరబాబు తెలిపిన కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా, డిండి మండలంలోని బొల్లనపల్లి గ్రామానికి చెందిన పేట వీరస్వామి (60) బతుకుదెరువు కోసం 28 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 18న స్వగ్రామానికి వెళ్లాడు. గురువారం చారగొండ మండలంలోని సిరసనగండ్లలోని తన సోదరి ఇంటికి బయలుదేరాడు. మార్గంమధ్యలో శాంతిగూడెం వద్ద, రోడ్డు పక్కనున్న కల్వర్టుపై కూర్చొని, అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికుల సమాచారంతో ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు తెలిపి, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరస్వామికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని మహిళ..



ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహిళ

కోస్గి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కోస్గి పట్టణంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన గొండ్ల చిన్నహన్మమ్మ (60) కోస్గి పట్టణానికి వచ్చింది. బస్టాండ్ నుంచి బయటికి వస్తుండగా, లోపలికి వస్తున్న నారాయణపేట డిపో బస్సు ఢీకొన్నది. దీంతో ఆమె కుడి మోకాలుకు తీవ్రగాయమైంది. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె బంధువు గొండ్ల రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండపల్లి చెరువులో మృతదేహం

గద్వాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని కొండపల్లి చెరువులో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. అక్కడ లభించిన ఆధారాల ప్రకారం గద్వాల, దేవేందర్‌నగర్ కాలనీకి చెందిన తెలుగు తిమ్ములమ్మ (40) గా నిర్ధారించారు. ఆమె కుటుంబ తగాదాల కారణంగా గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె, చెరువులో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆమెకు భర్త తాయన్న, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పొలంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

» టైర్ కింద పడి డ్రైవర్ మృతి

పెంట్లవెల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లగా, ప్రమాదం నుంచి తప్పించుకునే యత్నంలో డ్రైవర్ టైర్ కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల కేంద్రం సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జటప్రోలు గ్రామానికి చెందిన గొడుగు తిరుమలేశ్ (18) ట్రాలీ మరమ్మతు కోసం ట్రాక్టర్‌తో శుక్రవారం ఉదయం 7 గంటలకు కొల్లాపూర్‌కు వచ్చాడు. మెకానిక్ షెడ్ వద్ద ట్రాలీని వదిలేసి ట్రాక్టర్‌పై స్వగ్రామానికి బయలు దేరాడు. పెంట్లవెల్లి సమీపంలోని సవారమ్మ గుడి వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వరి పొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు కిందకు దూకిన తిరుమలేశ్, ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడి మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో, ఎస్ఐ రామన్‌గౌడ్ అక్కడికి చేరుకున్నాడు. ట్రాక్టర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో పక్కకు తొలగించి, మృతదేహాన్ని బయటకు తీశారు. సంఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా వేధింపులు

» పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

నవాబ్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలం విక్రయిస్తానని చెప్పి అడ్వాన్సు తీసుకుని భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరిస్తూ, వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చసినట్లు నవాబ్‌పేట ఎస్ఐ విక్రం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు అదే గ్రామానికి చెందిన జమీర్ వద్ద రూ.3 లక్షలు అడ్వాన్సు తీసుకుని, 5 గుంటల పొలం విక్రయిస్తానని ఒప్పంద పత్రం రాయించుకున్నాడు. కానీ అతడు భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నాడు. అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

లింగాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన సైదమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. ఆమె ఇంటి ముందున్న విద్యుత్ తీగల కోసం పాతిన కర్రను రాములు తొలగించడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో దాడి చేసినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

గండీడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీ కొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండలంలోని జానంపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన చెన్నయ్య (42) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొన్నది. ప్రమాదంలో గాయపడిన చెన్నయ్యను 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.



బాదేపల్లి బాలుర పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లోని ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలోని పరికరాలు



ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలో ఓ దృశ్యం

బోధించే అంశాలివే..

గురుత్వాకర్షణ శక్తి, గమన నియమాలు, యాంటి గ్రావిటీ, ఖగోళం లో జరిగే మార్పులను పరిశీలించడం అంశాలను విద్యార్థులు తెలుసు కోనున్నారు. శుక్లపక్షం సందర్భంలో చంద్రుడు పెరగడం, కృష్ణపక్షంలో చంద్రుడు తగ్గడం అనే చంద్రకళల పాఠ్యాంశాన్ని బోధించేందుకు ఫేస్ ఆఫ్ మూన్ మాడల్‌తో విద్యార్థులకు బోధపడనుంది. కాంతి వక్రీభవ నం, పరివర్తనం, కాంతి విక్షేపణంతో పాటు రుతువులు మారే క్రమంపై విద్యార్థులలో అవగాహన కలగనుంది.

ప్రాథమిక రంగులైన బ్లూ, గ్రీన్, రెడ్‌ల గురించి, వీటితో ఇతర రంగులను తయారు చేయడంపై విద్యార్థులకు బోధిస్తున్నారు. గురుత్వాకర్షణతో ఏఏ గ్రహంలో ఎంత బరువు కలిగి ఉంటుందనే అంశాన్ని బోధించేందుకు తొమ్మిది గ్రహాలుగా బాటిల్స్‌ను ఏర్పాటు చేసి బోధిస్తున్నారు.

విజ్ఞానం.. వినూత్నం

» శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థుల ఆసక్తి

» పీఎంశ్రీ హైస్కూల్స్‌లో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలు

» మహబూబ్‌నగర్ జిల్లాలోని 5 కేంద్రాల్లో ఏర్పాటు



ప్రయోగశాలలో టెలిస్కోప్‌ను పరిశీలిస్తున్న విద్యార్థి

జడ్చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొందించేందుకు కలెక్టర్ విజయేందిర బోయి వినూత్న కార్యక్రమాలను తీసుకువచ్చింది. శాస్త్ర, సాంకేతిక రంగంవైపు విద్యార్థులలో ఆసక్తి కలిగించేందుకు శ్రీకారం చుట్టింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని 5 కేంద్రాల్లో పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లలో, హైస్కూళ్లు, మాడల్‌స్కూళ్లలో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని పీఎంశ్రీ బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్, కోయిలకొండలోని పీఎంశ్రీ హైస్కూల్‌తో పాటు గండీడ్ మండలంలోని వెన్నచేడు మాడల్‌స్కూల్, చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట హైస్కూల్, మహబూబ్‌నగర్‌లోని మాడల్ బేసిక్ హైస్కూల్‌లలో ఏర్పాటు చేశారు. పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతరిక్షంపై అవగాహన కల్పించేందుకు, పాఠ్యాంశాలను పరికరాలతో బోధించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రయోగశాలలను తీసుకువచ్చారు. ఖగోళ విజ్ఞాన ప్రయోగశాల అనేది అంతరిక్షంలోని గ్రహాలు, నక్షత్రాలు, పాలపుంత వంటి వాటిని అధ్యయనం చేయడంతో పాటు వాటిని పరిశీలించేందుకు పరికరాలను ఏర్పాటు చేశారు.

అంతరిక్షంలోని కదలికలు, లక్షణాలు, విశ్వం ఆవిర్భావం వంటి విషయాలను పరిశీలించేందుకు టెలిస్కోప్‌ను సైతం ఏర్పాటు చేశారు. భౌతికశాస్త్ర, రసాయనశాస్త్రం, గణితశాస్త్రంతో కలిపి ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలో విద్యార్థులకు బోధిస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా టెలిస్కోప్

అంతరిక్షంలోని నక్షత్రాలు, గ్రహాలు, పాలపుంత, రాశులు గుర్తించడానికి ఖగోళ విజ్ఞాన కేంద్రంలో 16 మాగ్నఫైయింగ్ పవర్ కలిగిన టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. టెలిస్కోప్‌తో అంతరిక్షంను వీక్షించేందుకు లెన్స్‌లను అందించారు. వీటితో పాటు ధ్వని గురించి తెలుసుకునేందుకు శృతిదండాలు, మానవశరీరంపై అవగాహన పెంచుకునేందుకు మానవ శరీర భాగాల బొమ్మలను ఏర్పాటు చేశారు.

అంతరిక్షంపై విద్యార్థులలో ఆసక్తి పెంచేందుకు..



అంతరిక్షం అంశంపై విద్యార్థులలో ఆసక్తి పెంచేందుకు ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రయోగశాలలోని పరికరాలతో పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకోనున్నారు. విద్యార్థులకు ప్రయోగశాలతో ఎంతో విజ్ఞానం పెరగనుంది.

- శశిరేఖ, ఉపాధ్యాయురాలు

కొత్త విషయాలను నేర్చుకుంటున్న



ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలో కొత్త, కొత్త విషయాలను నేర్చుకుంటున్న. అంతరిక్షం అంటే ఏంటి.?, ఏమి ఉంటాయి.? వాటి మార్పు తదితర అంశాలను టెలిస్కోప్‌తో ప్రత్యక్షంగా వీక్షించి తెలుసుకుంటున్నాను.

- సాయిచరణ్, 10వ తరగతి, విద్యార్థి

జాతీయ స్థాయికి ఎదగాలి



ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీఈటీలు, అసోసియేషన్ సభ్యులు



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శారదాబాయి

» ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి

» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతి చాటి, జాతీయ స్థాయికి ఎదగాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శారదాబాయి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్టేడియం మైదానంలో ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-17, 19 సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఆదిలాబాద్ జిల్లాలో డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోమణ్‌గౌడ్, రమణ, రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, సుగుణ, నాగమణి, లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్కూల్ లీగ్స్, అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రికెట్ అండర్-14 బాలుర జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2011 సెప్టెంబరు 1 తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బోయపల్లి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు. వైట్‌షూ, వైట్ డ్రెస్ తప్పనిసరి అని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పురుషుల జట్ల ఎంపిక

రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల సాఫ్ట్ బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి పురుషుల జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలను పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఆదిలాబాద్‌లో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు, పీడీ వడెన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థి శశికాంత్‌ను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు



విద్యార్థి శివకు జ్ఞాపికను అందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

కోయిలకొండ/ ఎర్రవల్లి, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి శశికాంత్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో వెంకట్‌జీ తెలిపారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా, తూడుకూర్తిలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న శశికాంత్ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అతడు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు యాదాద్రి జిల్లా భువనగిరిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ విద్యార్థిని పీఈటీ మొగులాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాస్కెట్ బాల్ పోటీలకు..

జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాల విద్యార్థి శివ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పూడూరు గ్రామ శివారులోని ఎస్ఆర్ విద్యానికేతన్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ మధులిక విద్యార్థిని అభినందించారు.

జాతీయ ఆర్చరీ టోర్నీలో పాలమూరు మెరుపులు

» 6 స్వర్ణ పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు



జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్-14 ఆర్చరీ టోర్నీలో బంగారు పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆర్చరీ టోర్నీలో పాలమూరు జిల్లా క్రీడాకారులు మెరిశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారాణసిలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు 69వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కాంపౌండ్ రౌండ్ విభాగంలో సాయిసమీక్షగౌడ్, డి.సాయి సమీక్ష, శార్వాణి, అయేషాసిద్ధిఖ, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సాయిమణీశ్వర్, శార్వాణి బంగారు పతకాలు సాధించారు. వారిని డీఈవో ప్రవీణ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శాదరాబాయి కోచ్ జ్ఞానేశ్వర్, క్రీడాకారులను అభినందించారు. జిల్లా క్రీడాకారులు విలువిద్యలో అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గ్రామ స్టేజీ వద్ద బస్సు ఆపాలి

» ఫర్దిపూర్ విద్యార్థుల రాస్తారోకో

అయిజ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్టేజీ వద్ద బస్సు ఆపాలని డిమాండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మునిసిపాలిటీ పరిధిలోని పర్దిపూర్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కర్నూల్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన విద్యార్థులు అయిజ పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్నారు. కానీ గ్రామ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో అయిజకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో విసిగిపోయిన విద్యార్థులు శుక్రవారం కర్నూల్ - రాయిచూర్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆందోళన దాదాపు 2 గంటల పాటు కొనసాగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని, విద్యార్థులకు నచ్చచెప్పటంతో సమస్య సద్దుమణిగింది.



పర్దిపూర్ గ్రామ స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

నారాయణపేటలో ఆపరేషన్ చబుత్ర

» 56 మంది యువకులకు కౌన్సెలింగ్

» ఎస్పీ డాక్టర్ వినీత్



యువతకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్పీ

నారాయణపేట ,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 'ఆపరేషన్ చబుత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశం మేరకు స్థానిక పోలీసులు, ప్రత్యేక దళాలు కాలనీల్లో, హోటళ్లు, దుకాణాల ముందు, పబ్లిక్ ప్లేస్‌లలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణపేటలో 26 మంది, మక్తల్‌లో 18 మంది, మరికల్‌లో ఏడుగురు కోస్గిలో ఐదుగురు, మొత్తం 56 మంది యువకులను గుర్తించి పట్టుకున్నారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వారి వేలిముద్రలను పరిశీలించారు. తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో పునరావృతం అయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఢిల్లీ సమావేశానికి ఎంపికైన ప్రత్యేక అధికారి సుజాత



ఢిల్లీలో నిర్వహించనున్న సమ్మిట్‌కు ఎంపికైన సుజాత

తిమ్మాజిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారిగా పని చేస్తున్న సుజాత ఢిల్లీలో నిర్వహించే సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఖాన్ అకాడమీ స్టెమ్ అనే కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశపెట్టింది. ఆరు నెలలుగా స్థానిక కస్తూర్బాలో మంచి ఫలితాలు ఉన్నాయని, పాఠశాల వారీగా ప్రోగ్రెషన్ రిపోర్టు సంబంధిత అధికారులు తీసుకున్నారని, రాష్ట్ర స్థాయిలో టాప్-3లో తిమ్మాజిపేట కస్తూర్బా ఉందని ఆమె తెలిపారు.

దేశంలో పెరిగిన అత్యాచారాలు

» ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మల



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అచ్చంపేటటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో హింస, అత్యాచారాలు పెరిగాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు నిర్మల అన్నారు. ఈ నెల 25 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. మహాసభలకు అచ్చంపేట నుంచి అధిక సంఖ్య లో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాలు సైదమ్మ, సక్కమ్మ, లక్ష్మమ్మ, నారమ్మ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి

భూత్పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను స్వచ్ఛమైన వాతావరణంగా మార్చుకొనే బాధ్యత మనందరిపై ఉందని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా 8, 9 వార్డుల్లో మహిళా సంఘాలు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, కాలనీల్లో తిరుగుతు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. మన ఇంటి పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలు, మురుగు కాలువలను మనమే శుభ్రం చేసుకుంటే మన ఇల్లు, కాలనీ ఎంతో సుందరంగా కనిపిస్తుందన్నారు.

పథకాలు ప్రజలకు వివరించాలి

కోయిలకొండ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ వివరించాలని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొతలాబాద్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల నాయకులు సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, సత్యపాల్‌రెడ్డి, రవినాయక్, రామునాయక్, పవన్‌గౌడ్, గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్. వెంకట్రాములు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో మత ప్రచారం చేయొద్దు'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల్లో మత ప్రచారం సరికాదని మాజీ కౌన్సిలర్ కిశోర్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని డివైన్‌గ్రేస్ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమాచారం మేరకు పలువురు నాయకులు శుక్రవారం తనిఖీ చేశారు. విద్యా బుద్ధులు చెప్పే పాఠశాలలో ఓ మతం గురించి చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఓ మతానికి సంబంధించి ప్రార్థనలు చేయిస్తున్నారన్నారు. దీనిపై డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదని, వివరాలు తెలుసుకుని విచారిస్తామని బదులిచ్చారు.

'కార్మికులను ఆదుకోవాలి'

రాజాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి శివారులో ఉన్న ఓ లిక్కర్ పరిశ్రమలో ఇటీవల మహిళా కార్మికులకు విద్యుత్ షాక్ గురయ్యారు. శుక్రవారం విసం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు యజమాన్యంతో మాట్లాడారు. కార్మికులను ఆదుకుని, న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరహరి, శ్రీనివాస్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, రమణ పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడపాలని పలువురు ఆర్టీసీ ఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి పలువురు సమస్యలు తెలిపారు. జడ్చర్ల సమీపంలోని శంకరాయపల్లి బస్సు ఆపాలని కోరారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని భగీరథకాలనీ వద్ద బస్సులు ఆపాలని తెలిపారు. కర్నూల్ బస్సును బీచుపల్లి వద్ద ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కక్ష సాధింపు కోసమే కేటీఆర్‌పై విచారణ : బీఆర్ఎస్

జడ్చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై విచారణ చేపడుతున్నట్లు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్‌యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్ములా ఈ-రేస్ విషయంలో రెండేళ్లుగా కుట్ర పన్నుతూనే ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

పశువుల ఆరోగ్యమే రైతుకు సిరి

మిడ్జిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శుక్రవారం పాడి రైతులకు పశువుల్లో పెరుగుతున్న రుగ్మతలు, వాటి నిరోధక చర్యలు, సమయానుకూల చికిత్స పద్ధతులపై అవగాహన సదస్సును మండల పశువైద్యాధికారి అనుప శివరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువుల పాల ఉత్పాదకతను ప్రభావితం చేసే మెటబాలిక్ సమస్యలు, పోషకాహార లోపాలు, ప్రసవానంతర జాగ్రత్తలు, శారీరక మార్పులను గుర్తించే పద్ధతులపై రైతులకు వివరించారు.

జల్ది బిందె ఉత్సవం

కోయిలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేరివెంకటాపూర్‌లో ఆంజనేయస్వామి జల్ది బిందె ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వాగులో గంగామాతకు పూజలు నిర్వహించి జల్ది, స్వామి వారి పల్లకీ ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎస్.రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవి, మల్లయ్య పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భక్తులు అఖండ భజన చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి వారిని ఊరేగింపు చేపట్టారు. కొండ బుచ్చిరెడ్డి, రమేష్, శ్రీనువాసులు, సుధాకర్, రాములు పాల్గొన్నారు.

పాలమూరు జిల్లాకే వలస



చిన్నచింతకుంట శివారులో పత్తి ఏరుతున్న మంత్రాలయం కూలీలు

» ఏపీ నుంచి పత్తి ఏరివేతకు కూలీలు

» కుటుంబంతో సహ ఇక్కడే నివాసం

చిన్నచింతకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా పిలుస్తూ ఉండేవారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లిన పాలమూరు జిల్లా కూలీలు కనిపించేవారు. బతుకు భారమై, జీవనం కొనసాగించలేక పొట్ట చేత పట్టుకుని పిల్లలను తీసుకుని బొంబాయి, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లే వారు. ప్రస్తుతం అదే జిల్లాకే ఇతర ప్రాంతాల నుంచి కూలీలు వస్తు ఇక్కడే బతుకు దెరువు వెతుక్కోవడం గమనార్హం. అయితే వలస జిల్లాకే వలసలు వచ్చే విధంగా ప్రస్తుతం జిల్లా పరిస్థితి మారిందని స్పష్టమవుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంత్రాలయం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, నెల్లికొండి, వడెమాన్, ధమగ్నాపూర్, చిన్నచింతకుంట, మద్దూర్, ఎద్దులాపురం కురుమూర్తి, ఉంద్యాల, కౌకుంట్ల మండలం అప్పంపల్లి, దాసరిపల్లి, ముచ్చింతల గ్రామాల శివారులో రైతులు పత్తి సాగును పెద్ద ఎత్తున చేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలలో మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి పత్తి ఏరివేతకు కూలీలు భారీగా ఇక్కడికి చేరుకున్నారు. ఈ రెండు మండలాలకు సంబంధించి 2వేల మంది వరకు కూలీలు వచ్చారని తెలుస్తుంది. రోజుకు రూ.300 నుంచి రూ.400 కూలి సంపాదిస్తు ఇక్కడ జీవనం కొనసాగిస్తున్నారు. కేజీ పత్తి ఏరేందుకు రూ.15 ఇవ్వడంతో నిమిషం వృథా చేయకుండా బిజీబిజీగా పత్తి ఏరుతున్నారు.

కుటుంబంతో సహ వచ్చాం



మేం నలుగురం ఇక్కడకు వచ్చాం. రోజు రూ.300 నుంచి రూ.400 వరకు మాకు కూలి పడుతుంది. అక్కడ పనులు లేక ఇక్కడికి వచ్చాం. మేము ఉంద్యాల, మద్దూరు శివారులో పత్తి చేనులో ప్రస్తుతం పనులు చేస్తున్నాం.

\- ముత్తమ్మ, మంత్రాలయం

అక్కడ బతుకు దెరువు లేదు



మేం కుటుంబంతో సహా ఇక్కడికి వచ్చాం. ప్రస్తుతం పత్తి చేనులో కూలీ పనులు చాలా వరకు ఉన్నాయి. ఇక్కడ రోజు రూ.400 వరకు సంపాదిస్తు, జీవనం గడుపుతున్నాం. ఉపాధి లేక ఇక్కడికి వచ్చాం.

\- తిక్కన్న , మంత్రాలయం

స్థానికంగా కూలీల కొరత



నేను పత్తి సాగు చేశాను. ఇక్కడ కూలీలు దొరకడం లేదు. ఏపీ నుంచి పత్తిని ఏరేందుకు కూలీలు భారీగా వస్తారు. వీరు రావడంతో ఉపయోగకరంగా ఉంది.

\- గొల్ల కృష్ణయ్య, చిన్నచింతకుంట

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం

పాలమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రభుత్వం కార్మికరైతు,వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే నల్లచట్టాలను తీసుకొచ్చిందని, వాటికి వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కేంద్రంలో ధర్నా చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడారు. ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

సామాజిక తనిఖీ ప్రారంభం

నవాబ్‌పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని 54 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ ప్రారంభమైనట్లు ఏపీఓ జ్యోతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఆర్పీలు రాజు, భద్రునాయక్ ఆధ్వర్యంలో డీఆర్పీలు, కిందిస్థాయి సిబ్బందితో కలిసి సామాజిక తనిఖీ అంశాలపై చర్చించారు. రూ.8.92 కోట్ల విలువ చేసే పనులకు సంబంధించి తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు సహకరించాలని ఏపీవో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబ్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రారం నుంచి ఇప్పటూర్, కూచూర్ గ్రామాలకు వచ్చే 33 కేవీ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కూచూరు, దొడ్డిపల్లి, కారూర్, హన్మసానిపల్లి, ఇప్పటూర్, మల్లారెడ్డిపల్లి, చెన్నారెడ్డిపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని పాలమూరు యూనివర్సిటీ టీచింగ్ యూనియన్ (పుట) అధ్యక్షుడు భూమయ్య డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. అర్జున్ కుమార్, గౌస్‌మొయినుద్దీన్, జిమ్మికాటన్, శైలేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బాలానగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అశ్విని అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో 42 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, శశి కళారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, హరిసింగు, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్ నాయక్, శంకర్‌నాయక్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అపార్ ఐడీ వంద శాతం పూర్తి చేయాలి



గండీడ్‌లో మాట్లాడుతున్న ఎంఈవో జనార్దన్

జడ్చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలోని విద్యార్థుల అపార్ ఐడీ వంద శాతం జనరేట్ చేయించాలని ఎంఈవో మంజులాదేవి సూచించారు. బాదేపల్లి బాలుర జడ్పీ హెచ్ఎస్ ఆవరణలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2026 ఫిబ్రవరి, మార్చి నెలలో 3వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహించే ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. హెచ్ఎం అనంతప్ప, శ్రీనివాసులు, లక్ష్మీ, వెంకట్‌రెడ్డి, చంద్రకళ పాల్గొన్నారు.

చతుర్విధ ప్రక్రియలు రావాలి

గండీడ్: విద్యార్థులకు ప్రాథమిక దశలో చతుర్విధ ప్రక్రియలు కచ్చితంగా రావాలని ఎంఈవో జనార్దన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన పాఠశాలల వారీగా సమ్మేటివ్, అసెస్మెంట్ వన్ పరీక్ష ఫలితాల గురించి అడిగి తెలుసుకున్నారు.

విత్తన చట్టంపై అవగాహన పెరగాలి

పాలమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్త విత్తన చట్టంపై అధికారులు, రైతులు అవగాహన పెంచుకోవాలని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సదయ్య, కల్యాణి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. సేకరించిన అభిప్రాయాలను శాస్త్రవేత్తలు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ అర్చన, అధికారులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సదయ్య

మత్స్యకారుల స్థితిగతులు మార్చడమే లక్ష్యం

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, జీవన స్థితిగతులను మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు వద్ద నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. చేప పిల్లల పంపిణీ, బీమా, శిక్షణ కార్యక్రమా లు, ఆధునిక మత్స్యపరిశ్రమ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంకోసం చేపట్టిన ప్రతీ పథకం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గోనెల శ్రీనివాస్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కొత్త చెరువులో చేపపిల్లలను వదిలిపెట్టారు.



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

భూత్పూర్: మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామంలో మత్స్యకారుల సంఘం భవనం వద్ద మెట్టుకాడి ప్రభాకర్, పెద్ద విజయ్‌కుమార్, సత్తన్న, సాయి కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు.

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలో లక్ష్మీనారాయణ ఆలయంలో ఆవరణలో భారీ కేక్‌ను కట్ చేశారు. శివప్రసాద్, చెన్నకేశవులు, ప్రవీణ్, రాములు, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: మునిసిపాలిటీలోని బూరెడ్డిపల్లిలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పాల్గొని కేకును కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. నర్సింహులు, వెంకటేశ్, సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్ పాల్గొన్నారు.



భూత్పూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



జడ్చర్లలోని బూరెడ్డిపల్లిలో కేక్ కట్ చేసిన చైర్‌పర్సన్ పుష్పలత

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

హన్వాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని తనిఖీ చేశారు. పది రోజుల నుంచి ఇక్కడే ఉన్నామని ఇంకా కొనుగోలు చేయలేదని కొందరు రైతులు తెలిపారు. తూర్పు పట్టకపోవడంతో ఆలస్యమవుతుందని నిర్వాహకులు తెలిపారు. తూర్పుపట్టిన ధాన్యానికి టోకెన్లు ఇచ్చి కొనుగోలు ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు బాగున్నాయని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. శుక్రవారం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.



నాయినోనిపల్లి కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

సదస్సును విజయవంతం చేయాలి

» ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్ హుస్సేన్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్‌హుస్సేన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన ఉద్యోగులు, పాత్రికేయులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వహిద్‌షా, ఖాజనిజాముద్దీన్, అబ్దుల్‌హకీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్‌హుస్సేన్

ఆసుపత్రి పడకల తగ్గింపు సరికాదు

జడ్చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాలానగర్ సీహెచ్‌సీ ఆసుపత్రుల పడకల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని శుక్రవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌కు మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సురేశ్ వినతి పత్రం అందచేశారు. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర నాయకులు యూసుఫ్, నరసింహ, సుధాకర్, ఓమయ్యలతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాలం చెల్లిన పాత టెండర్లను రద్దు చేయాలని కోరారు. పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్‌లకు రూ.26వేల వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్యుపెన్సీ తగ్గిందనే సాకుతో పడకల సామర్థ్యం తగ్గించడం బాధాకరమని పేర్కొన్నారు.



వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పండుగలా ఇందిరమ్మ చీరల పంపిణీ

» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్/ మహమ్మదాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ చీరల పంపిణీ పండుగలా కొనసాగాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని తన నివాసంలో గండీడ్, మహమ్మదాబాద్ మండలా ల ఐకేపీ సిబ్బందికి చీరలను అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నారా యణ, శాంతిరంగ్యా, ఈసాబప్రావి, ఏపీఎంలు రజిత, నిర్మలా తదితరులు పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో వెంకట్, ప్రమోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును మండల ఇన్‌చార్జి వెంకటయ్య, ఎంఈవో సరస్వతి ప్రశ్నాపత్రాలను అందించి ప్రారంభించారు. జిల్లా స్థాయి కోసం మూడు పాఠశాలలను ఎంపిక చేశారు.

జడ్చర్ల: మునిసిపాలిటీలోని పీఎంశ్రీ బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రంను ఎంఈవో మంజులాదేవి విడుదల చేశారు.



మిడ్జిల్‌లో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎంఈవో సరస్వతి

కోయిలకొండ: మండలంలో నిర్వహించిన చెక్‌ముకి పోటీల్లో కోయిలకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో ప్రథమ బహుమతిని గెలుపొందిన హెచ్ఎమ్ వెంకట్‌జీ తెలిపారు.

హన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ ట్యాలెంట్ పరీక్ష నిర్వహించారు. తెలుగు మీడియంలో చిన్నదర్పల్లి విద్యార్థులు, ఇంగ్లిష్ మీడియంలో హన్వాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

నేడు వార్డు రిజర్వేషన్లకు డిప్

కోయిలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వార్డుల రిజర్వేషన్లను శనివారం ఎంపీడీవో కార్యాలయంలో డిప్ ద్వారా కేటాయించనున్నట్లు ఎంపీడీవో ధనుంజయగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

రుణాలు మంజూరు చేయాలి

కోయిలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో గార్లపాడు రైతులకు దీర్ఘకాలిక రుణాల మంజూరు పెంపునకు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం చైర్మన్‌ను కలిసి మండల రైతుల సమస్యలపై చర్చించారు. సింగిల్‌విండో రైతులకు ఏఐఎఫ్ స్కీమ్ ద్వారా గొర్రెలు, ఆవులు, యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

గండీడ్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలగకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంచన్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏవో రాధమ్మ, ఏపీఎం రజిత, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

నేడు బీసీ అవగాహన సదస్సు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అంశంపై శనివారం పాలమూరు యూనివర్సిటీలో మధ్యాహ్నం 2 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పీయూ బీసీ విద్యార్థి సంఘం నాయకుడు తాయప్ప తెలిపారు. కార్యక్రమానికి డాక్టర్ విశారదన్ మహరాజ్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు హాజరవుతారని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం

భూత్పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలతో పిల్లల జీవితాలు నాశనమవుతాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మహేశ్వరి, కార్యదర్శి మహేశ్వర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్కిచర్ల జడ్పీహెచ్ఎస్‌లో బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో పది రోజుల పాటు అందుబాటులో ఉండరని, డిసెంబర్ 1న విధుల్లో చేరుతారు.